నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ద్వారకాతిరుమల, కొమ్మగూడెం, వసంత్ నగర్ కాలనీ, లక్ష్మీపురం గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

మళ్లీ తెరపైకి క్షేత్ర రహదారి విస్తరణ పనులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో రహదారి విస్తరణ పనులు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఈ క్రమంలో అధికారులు శుక్రవారం మార్కింగ్ ఇచ్చారు. అయితే గతంలో రహదారికి ఎడమ వైపు ఇచ్చిన మార్కింగ్, ఇప్పుడు కుడి వైపుకు మారడంతో వ్యాపారులు, గృహ యజమానులు అయోమయంలో పడ్డారు. అసలు ఆక్రమణకు గురైన ఆర్అండ్‌బీ స్థలం ఏవైపు ఉందో, ఎక్కడ ఉందో అధికారులకు తెలియదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



గడ్డి చుట్టే యంత్రం.. రైతులకు వరం

- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం
- పశుగ్రాసం సేకరణలో రైతులకు అండ


బుట్టాయగూడెం పొలంలో గడ్డి చుడుతున్న యంత్రం


చుట్టిన గడ్డి కట్టలను ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: వ్యవసాయ రంగంలో యాంత్రీకరణతో ఖర్చుతో పాటు సమయమూ ఆదా అవుతోంది. వరి నాట్లు వేసినప్పటి నుంచి కోత దశకు చేరుకునే వరకు వివిధ స్థాయిల్లో యంత్రాలు రైతులు అండగా నిలుస్తున్నాయి. కూలీలు కొరతను తీర్చుతున్నాయి. వరి పంటను యాంత్రాల ద్వారా కోయించడం వల్ల చేలో గడ్డి చెల్లాచేదురుగా పడి ఉంటుంది. ఈ గడ్డిని సేకరించే యంత్రం అందుబాటులోకి రావడంతో తక్కువ సమయంలో ఎక్కువ గ్రాసాన్ని సేకరించడంతోపాటు కూలీల ఖర్చు సైతం రైతులకు ఆదా అవుతుంది.

రవాణా సులభం

యంత్రాలతో వరి పంట కోత కోసిన తర్వాత గడ్డిచుట్టే యంత్రాన్ని ట్రాక్టర్‌కు బిగిస్తే గడ్డిని గుండ్రంగా చుట్టి కట్టలు కడుతుంది. ఎకరం పొలంలో గడ్డిని కట్టలుగా కట్టేందుకు సుమారు గంట సమయం పడుతుంది. దాదాపు 40 నుంచి 50 గడ్డి కట్టలు వస్తాయి. ఒక్కొక్క కట్ట చుట్టినందుకు రూ.35 యంత్రాల యజమానులు తీసుకుంటున్నారు. రోజుకు సుమారు 10 ఎకరాల్లో ఈ యంత్రాలు పశుగ్రాసం కట్టలు కడుతున్నాయి. గడ్డి కట్టే యంత్రాల వల్ల సమయంతో పాటు ఖర్చు ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు. గడ్డిని చుట్టలుగా చుట్టడం వల్ల ఒకేసారి ట్రాక్టర్‌పై సుమారు ఐదెకరాల పశు గ్రాసాన్ని తరలించేందుకు వీలుంటుంది.

కూలీల ఖర్చు ఆదా

వరి పంట కోసిన తర్వాత గడ్డి కట్టలుగా కట్టేందుకు కూలీలను పిలిచినా రావడంలేదని రైతులు చెబుతున్నారు. పంట పొలాల్లో ఉన్న గడ్డి వర్షం వస్తే తడిసి మురిగిపోతుంది. పశువుల మేతకు పనిచేయదు. గడ్డిచుట్టే యంత్రాలు అందుబాటులోకి వచ్చి కూలీల అవసరం లేకుండానే గడ్డిని చుట్టలుగా చుట్టడంతో ఖర్చులు తగ్గుతుంది.

కాలుష్య కట్టడి

గడ్డిని పొలాల్లోనే నిప్పు పెట్టకుండా చుట్టలు చుట్టి విక్రయించుకోవడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చు. పొగ నుంచి ప్రజలను రక్షించవచ్చు. గడ్డి కొరత తీరుతుంది. నేల సారం కోల్పోకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

తగ్గిన ఖర్చులు



గతంలో వరి గడ్డి ఒక చోటికి తేవడానికి, గడ్డి మేటుగా వేయడానికి రోజుకు ఒక్కో కూలీకి రూ.500 ఖర్చు అయ్యేవి. అయితే గడ్డి చుట్టే యంత్రం అందుబాటులోకి రావడంలో ఈ ఏడాది గడ్డి కట్టలు కట్టడానికి ఖర్చులు తగ్గాయి. సమయం కూడా చాలా కలిసి వచ్చింది. గడ్డి కట్టలు కట్టడంతో గడ్డి కూడా ఎక్కువ కాలం పాడవకుండా ఉంటుంది. గడ్డి చుట్టే యంత్రం రైతులకు వరంలా ఉంది.

– తెల్లం వెంకటేష్, వరి రైతు, చెంచుగూడెం

మహిళ అదృశ్యం

జంగారెడ్డిగూడెం: మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లిపూడి వీరవెంకటేష్‌కు, నాగలక్ష్మికి వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారు. నాగలక్ష్మి తరచుగా ఫోన్ మాట్లాడుతుండటంతో వెంకటేష్ మందలించడంతో ఈ నెల 11వ తేదీన కుమార్తె జస్మితను తీసుకుని ఇంటి నుంచి నాగలక్ష్మి వెళ్లిపోయింది. శుక్రవారం వెంకటేష్ వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు హెచ్‌సీపీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

- మైసన్నగూడెంకు చెందిన నంబూరి సరోజిని ఇంటిలో ఆడమిల్లికి చెందిన చింతల వెంకటేశ్వరరావు అక్రమంగా ప్రవేశించి, సరోజినిని, ఆమె భర్త, అత్తలను కొట్టి గాయపర్చి, ఇంట్లో ఉన్న సామగ్రిని ధ్వంసం చేశాడు. సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు.
- వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. మండలంలోని తాడువాయి సెంటర్‌లో చిన్న హోటల్ నడుపుకునే మహ్మద్ షాజహాన్ ఈ నెల 19వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో హోటల్ మూసివేసి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు పైకి రాగా, గుర్తు తెలియని వ్యక్తి అతివేగంగా మోటార్ సైకిల్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో షాజహాన్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. షాజహాన్ సోదరుడు మహ్మద్ కాలేషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. షాజహాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



నేడు మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు


దొరమామిడిలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

బుట్టాయగూడెం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను గిరిజన ప్రాంతంలో ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలను అన్ని గ్రామాల్లోనూ నిర్వహించనున్నారు. బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల్లో కేక్‌లు కట్ చేయడంతోపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బుట్టాయగూడెంలో మాజీ ఎమ్మెల్యే బాలరాజు కేక్ కట్ చేస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు తెలిపారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు.

నేడు లింగపాలెం మండలంలో..

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు లింగపాలెం మండలంలో శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ కొఠారి మోహన్‌రావు తెలిపారు. వైఎస్సార్ విగ్రహాల వద్ద జగన్ జన్మదిన కేక్‌లను కట్ చేసి, పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పాల్గొంటారని, పార్టీ శ్రేణులు, అభిమానులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ఎంపీటీసీలు, సర్పంచ్‌ల నిరసన


పోలవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

పోలవరం రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగా, మధ్యాహ్నం 12 గంటలైనా పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాకపోవడంతో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశాన్ని బహిష్కరించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్య వైఖరిని తప్పుపట్టారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ మంజూరులో జాప్యంపై నిలదీత

బుట్టాయగూడెం: ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుని ఐదు నెలలు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు ఇవ్వడంలేదంటూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తహసీల్దార్ పీవీ చలపతిరావును నిలదీశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ గాలి దుర్గారావు మాట్లాడుతూ చీమలవారిగూడెంకు చెందిన కె.మంగాయమ్మ అనే మహిళ చనిపోతే వారి కుటుంబ సభ్యులను ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం ఐదు నెలలుగా తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సకాలంలో సర్టిఫికెట్‌లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. సమస్య పరిష్కారానికి తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఇళ్ల మంజూరైన వారికి మట్ట తోలుకునేందుకు అనుమతులు ఇవ్వాలని సభ్యులు అధికారలను కోరారు.

పథకాల అమలు వివరాలు వెల్లడించండి

చింతలపూడి : సంక్షేమ పథకాల అమలు వివరాలను ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా తెలియజేయాలని ఎంపీపీ బి.రాంబాబు నాయక్ అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అధికారులు ప్రోటోకాల్ పాటించాలని కోరారు. రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. అల్లిపల్లి నుంచి మండలపల్లి వెళ్లే రోడ్డు ఆంధ్రా బార్డర్ వరకు అభివృద్ధి చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మొలుగుమాటి నీరజా సుధాకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు


వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను కలిసిన సందీప్

లింగపాలెం: వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ పార్టీ పటిష్టతకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారని సందీప్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు అభినందనలు


బొడ్డు వెంకటేశ్వరరావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చింతలపూడి : వైఎస్సార్ సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావును ఆ పార్టీ నాయకులు పలువురు కలిసి అభినందనలు తెలిపారు. శుక్రవారం బొడ్డు నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్‌రావు, ట్రేడ్ యూనియన్ నాయకులు ఎం ఇమ్మానియేలు, నాయకులు జంగా చెన్నకేశవరెడ్డి, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, దాసు, బాష తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ రామకృష్ణను అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

పార్టీ బలోపేతానికి కృషి

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ రామకృష్ణ అన్నారు. మండలంలోని పలువురు నాయకులు శుక్రవారం ఆయిన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో ఏలూరు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్, పార్టీ టౌన్ కన్వీనర్ నానాది సాగర్, చింతపల్లి సుధా, గుర్రాల జీవన్ కుమార్, సూరం ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.



హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

చింతలపూడి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అన్ని విధాలుగా ఆయువుపట్టుగా ఉన్నా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వైద్య ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాఘవపురం పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు కావాలి, పీహెచ్‌సీలకు రావాలి అనే నినాదంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్లను కోర్టు ఆదేశాల సాకుతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నుంచి పీకేయడం అన్యాయమన్నారు. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్ చైతన్య, డాక్టర్ దొరసానమ్మ, సీహెచ్‌ఓ పి.రవి కుమార్‌లకు వినతి పత్రం అందించారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

జంగారెడ్డిగూడెం: ఏపీ మెడికల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్, సెక్యూరిటీ సిబ్బంది హాస్పిటల్ వద్ద ధర్నా చేశారు. నాలుగు నెలల బకాయి జీతాలు వెటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు కూనపాముల విఘ్నేష్, మండల కార్యదర్శి కుంచె వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

- **చింతలపూడి :** స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి ఎదుట పారిశుద్ధ్య కార్మికులు ధర్నా చేశారు. కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ కార్యదర్శి తోర్లపాటి బాబు డిమాండ్ చేశారు.
- **బుట్టాయగూడెం:** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీహెచ్‌సీ వద్ద ధర్నా చేశారు. సంఘ నాయకులు బేతి కిషోర్ మాట్లాడారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి

వేలేరుపాడు: డిగ్రీ, ఇంజినీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నగదు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యర్రా మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వేలేరుపాడు అంబేడ్కర్ కూడలిలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఏపీజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య మాట్లాడారు.



షా వ్యాఖ్యలు బాధాకరం

బుట్టాయగూడెం: బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కోరుతూ కేవీపీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా నేత అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ షా వ్యాఖ్యలు అత్యంత బాధాకరమన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద గిరిజన సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ గిరిజన సంఘాల జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు.

- **కుక్కునూరు:** బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. కుక్కునూరులో నిరసన వ్యక్తం చేశారు.

ఓటీటీ చిత్ర నిర్మాణం ప్రారంభం

జంగారెడ్డిగూడెం: స్థానిక గంగానమ్మ గుడి వద్ద శుక్రవారం క్లాప్ కొట్టి ఓటీటీ చిత్ర నిర్మాణాన్ని స్థానిక ప్రముఖులు ప్రారంభించారు. అనన్య చిత్రం డైరెక్టర్ బి.ప్రసాద్ రాజు వర్మ మూవీ క్రియేషన్ బ్యానర్‌పై అల్లుళ్లొచ్చారు సంక్రాంతికి అనే కొత్త ఓటీటీ సినిమా చిత్రీకరణకు జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి క్లాప్ కొట్టి ప్రారంభించారు. పెనుమర్తి రామ్‌కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. రాజాన పండు మొదటి షాట్‌కు దర్శకత్వం వహించగా, ఎంటీఆర్ సెంటర్‌లో షూటింగ్ కొనసాగించారు.

